


RNI: APTEL/2010/36742

# న్యూస్ వార్
వార్తా పత్రిక

TELANGANA RISING GLOBAL SUMMIT

నల్లగొండ | epaper.news war.com | శుక్రవారం 3, ఏప్రిల్ 2026 | సంపుటి :16 సంచిక :15 | ఎడిటర్: నటవా కృష్ణారావు | పేజీలు : 4 , వెల.2.00


## హైదరాబాద్ సహా పలు నగరాల్లోని ఐప్యాక్ కార్యాల యాల్లో ఈడీ సోదాలు

పశ్చిమ బెంగాల్‌లో బొగ్గు స్మగ్లింగ్ కేసుకు సంబంధించి కేంద్ర దర్యాప్తు సంస్థ ఈడీ ప్రముఖ రాజకీయ కన్సల్టెన్సీ ఐప్యాక్ కార్యాలయాల్లో సోదాలు చేపట్టింది. హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీలోని ఐప్యాక్ కార్యాలయాల్లో ఏకకాలంలో ఈడీ అధికారులు సోదాలు చేపట్టారు.

వార్త 2లో



## ఆ అధికారుల నిర్బంధం తెలి యదు.. పాలన నా చేతుల్లో లేదు: మమతా బెనర్జీ

మాల్దా జిల్లాలో 'సర్' విధుల్లో ఉన్న ఏడుగురు జ్యుడీషియల్ అధికారులను నిర్బంధించిన విషయం తనకు తెలియదని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తెలిపారు. ఈ నెలలో బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయి. ఈ క్రమంలో అధికారులను నిర్బంధించడం ఆ రాష్ట్రంలో తీవ్ర దుమారం రేపుతోంది.

వార్త 2లో



## ఇరాన్ యుద్ధంపై ఆస్ట్రేలియా ప్రధాని సంచలన వ్యాఖ్యలు

పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల నడుమ, అమెరికాకు అత్యంత సన్నిహిత మిత్రదేశమైన ఆస్ట్రేలియా నుంచి అనూహ్య వ్యాఖ్యలు వెలువడ్డాయి. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ కూటమి కొనసాగిస్తున్న దాడుల ఉద్దేశాన్ని ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఆంథోనీ అల్బనీస్ సూటిగా ప్రశ్నించారు. ఈ యుద్ధానికి ముగింపు ప్రణాళిక ఏంటని ఆయన నిలదీశారు.నేషనల్ ప్రెస్ క్లబ్‌లో ప్రసంగించిన అల్బనీస్, "ఇరాన్‌లో ఇంకా సాధించాల్సింది ఏముంది?" అని నేరుగా వేసిన ప్రశ్న అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. ఇరాన్ అణ్వాయుధాలు పొందకుండా నిరోధించడం, దాని సైనిక సామర్థ్యాన్ని తగ్గించడం వంటి అమెరికా ప్రాథమిక లక్ష్యాలకు తాము మద్దతిచ్చామని ఆయన గుర్తుచేశారు.

వార్త 2లో



# గ్రామీణాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి

మొదటి విడత నిధులు విడుదలపై హర్షం

యుటిలైజేషన్ సర్టిఫికెట్లు సమర్పిస్తే తదనుగుణంగా

నిధులను విడుదల చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధం

గ్రామ పంచాయతీ నిధుల విడుదలపై

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రకటన..



**ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు 2025-26 సంవత్సరానికి సంబంధించిన మొదటి విడత నిధులు విడుదలపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.**

తెలంగాణ గ్రామ పంచాయతీల కోసం రూ.619.85 కోట్లు విడుదల చేయడాన్ని స్వాగతించారు కేంద్ర మంత్రి. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 'సబ్‌కా సాథ్.. సబ్‌కా వికాస్' మంత్రాన్ని అక్షరాలా ఆచరణలో పెడుతూ ప్రతి గ్రామం సమగ్రాభివృద్ధికి బాటలు వేస్తోందన్నారు.

వార్త 2లో

## నాడు హైదరాబాద్ అభివృద్ధికి చంద్రబాబు కృషి

రాజ్యసభ ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్

**దూరదృష్టి గల నాయకుడిగా ఆనాడు హైదరాబాద్ అభివృద్ధికి చంద్రబాబు నాయుడు కృషి చేశారని, విభజన తర్వాత ఏపీకి అమరావతి రాజధానిగా సంకల్పం తీసుకుని ముందుకు సాగుతున్నారని తెలంగాణ బీజేపీ నాయకుడు, రాజ్యసభ ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. అమరావతికి ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారని, రెండు రాష్ట్రాల అభివృద్ధికి ఎన్డీయే కట్టుబడి ఉందని అన్నారు.**



వార్త 2లో

## అఖిలపక్ష సమావేశానికి మోదీ గైర్హాజరు.. ప్రధాని ఎక్కడని నిలదీసిన ఖర్గే

పార్లమెంట్ వేదికగా అధికార, ప్రతిపక్షాల మధ్య మరోసారి మాటల యుద్ధం జరిగింది. పశ్చిమాసియా సంక్షోభంపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశానికి ప్రధాని మోదీ హాజరుకాకపోవడాన్ని రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే తీవ్రంగా ప్రశ్నించారు. దీనిపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు గట్టిగా బదులివ్వడంతో సభలో కాసేపు వేడి రాజుకుంది. "పశ్చిమాసియా ఉద్రిక్తతలపై మీరు అఖిలపక్ష సమావేశం పెట్టారు. ఆ సమావేశానికి ప్రధానమంత్రి ఎందుకు రాలేదు?" అని ఖర్గే ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. ఇంధన ధరల పెరుగుదల వంటి కీలక అంశాలపై చర్చకు రాకుండా, ప్రభుత్వం తన అజెండాను ప్రతిపక్షాలపై రుద్దుతోందని ఆయన ఆరోపించారు.



వార్త 2లో

## మూసీ ప్రాజెక్టుపై ఎన్‌జిటిలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఊరట..


ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ ప్రాజెక్టుపై ఎన్‌జిటిలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఊరట లభించింది. మూసీ ప్రక్షాళనలో భాగంగా ప్రభుత్వం చేపట్టనున్న గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు సంబంధించి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నుండి అనుకూలంగా తీర్పు వచ్చింది. ఎన్‌జిటి నుండి ముందస్తు అనుమతులు తీసుకోకుండానే పర్యావరణంపై ప్రభావం చూపే ఈ ప్రాజెక్టును చేపడుతున్నారని బిఆర్ఎస్ నాయకుడు పటోళ్ల కార్తీక్ రెడ్డి ట్రిబ్యునల్ లో పిటిషన్ దాఖలు చేశారు. గురువారం దీనిపై ట్రిబ్యునల్ విచారణ జరిపింది. కేవలం రాజకీయ దురుద్దేశంతోనే మూసీ ప్రాజెక్టును అడ్డుకుంటున్నారని ఈ సందర్భంగా ప్రభుత్వ తరపు న్యాయవాదులు వాదించినట్లు తెలుస్తోంది. రెండు వైపుల వాదనలు విన్న ట్రిబ్యునల్.. కార్తీక్ రెడ్డి పిటిషన్ ను డిస్మిస్ చేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో ప్రాజెక్టుకు సంబంధించి ఎన్‌జిటి నుండి మార్గం సుగమమైనట్లే అని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి.



## రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ మోసం చేసింది: హరీష్ రావు

కాంగ్రెస్ సర్కార్ రాష్ట్ర యువతను తీవ్రంగా దగా చేసిందని మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, అమలు కాని హామీలలో అధికారంలోకి వచ్చి ప్రజలను నిలువునా ముంచారని అన్నారు. సంగారెడ్డిలో బిఆర్ఎస్ లో చేరికలు కొనసాగాయి.

వార్త 2లో



# గ్రామీణాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి

## మొదటి విడత నిధులు విడుదలపై హర్షం

## యుటిలైజేషన్ సర్టిఫికెట్లు సమర్పిస్తే తదనుగుణంగా నిధులను విడుదల చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధం

## గ్రామ పంచాయతీ నిధుల విడుదలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రకటన..

హైదరాబాద్: న్యూస్‌వార్ ప్రతినిధి

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు 2025-26 సంవత్సరానికి సంబంధించిన మొదటి విడత నిధులు విడుదలపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ గ్రామ పంచాయతీల కోసం రూ.619.85 కోట్లు విడుదల చేయడాన్ని స్వాగతించారు కేంద్ర మంత్రి. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 'సబ్‌కా సాథ్.. సబ్‌కా వికాస్' మంత్రాన్ని అక్షరాలా ఆచరణలో పెడుతూ ప్రతి గ్రామం సమగ్రాభివృద్ధికి బాటలు వేస్తోందన్నారు. కేంద్రం విడుదల చేసిన రూ.619.85 కోట్ల నిధుల్లో రూ.371.91 కోట్లు టైడ్ గ్రాంట్, రూ.247.94 కోట్లు అన్ టైడ్ గ్రాంట్ కింద ఉన్నాయన్నారు. టైడ్ గ్రాంట్ నిధులతో గ్రామాల్లో రోడ్ల నిర్మాణం, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, మురుగునీటి శుద్ధి, వర్షపు నీరు సంరక్షణ, ప్రజల జీవన ప్రమాణాల పెంపు వంటి అనేక పనులు చేయవచ్చన్నారు. అన్ టైడ్ గ్రాంట్ నిధులను మాత్రం స్థానిక అవసరాలకు అనుగుణంగా గ్రామ సభల్లో నిర్ణయం తీసుకుని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టుకోవచ్చని



కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు.

### కేంద్ర మంత్రి ప్రకటన ఇదే..

'15వ ఆర్థిక సంఘం సిఫార్సుల ప్రకారం.. గ్రామీణ స్థానిక సంస్థలకు కేటాయించిన నిధులు కేంద్రం నుంచి రాష్ట్రాలకు అందిన వెంటనే ఆయా రాష్ట్రాల ఆర్థిక శాఖలు 10 పని దినాలలోపు సంబంధిత గ్రామ పంచాయ తీలకు నిధులను వెంటనే బదిలీ చేయాల్సి ఉంటుంది. అంతకుమించి ఆలస్యం జరిగితే రాష్ట్ర ప్రభుత్వాలు ఇతర పథకాల కోసం తీసుకున్న మార్కెట్ రుణాలు/రాష్ట్ర అభివృద్ధి రుణాల(రాణూ)పై చెల్లిస్తున్న వడ్డీ రేటు ప్రకారం గ్రామ పంచాయతీలకు వడ్డీతో కలిపి చెల్లించాల్సి ఉంటుంది. అలాగే కేంద్రం విడుదల చేసిన నిధులకు సమానంగా మ్యాచింగ్ గ్రాంట్లు విడుదల చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే. 2015-16 నుంచి 2019-20 వరకు 14వ ఆర్థిక సంఘం కింద రూ.5,060 కోట్లు విడుదల చేయగా.. 2020-21 నుంచి 2025-26 వరకు 15వ ఆర్థిక సంఘం కింద కేటాయింపులు 80 శాతం పెరిగి రూ.9,050 కోట్లకు చేరుకున్నాయి. దీంతో 14, 15వ ఆర్థిక సంఘాల కాలంలో కేంద్రం మొత్తం రూ.14,110 కోట్లు తెలంగాణకు కేటాయించింది. వీటిలో 2026 జనవరికి ముందే రూ.11,111 కోట్లు రాష్ట్రానికి కేంద్రం విడుదల చేసింది. 2024-25కు సంబంధించి 2026 జనవరి నుంచి ఇప్పటివరకు రూ.1,032.42 కోట్లను విడుదల చేసింది. తాజాగా 2025-26కు సంబంధించి రూ.619.85 కోట్లను మొదటి విడత కింద విడుదల చేసింది. ఇక, 16 ఆర్థిక సంఘం కింద 2026-27 నుంచి 2030-31 మధ్య కాలంలో తెలంగాణలోని గ్రామ పంచాయతీలు రూ.9,968 కోట్లను గ్రాంట్ రూపంలో కేంద్రం నుంచి పొందనున్నాయి. తెలంగాణ ప్రభుత్వం సకాలంలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించని కారణంగా.. రెండేళ్ల పాటు (2023-24, 2024-25 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన) నిధులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిగిన తర్వాత కేంద్రం వాటిని విడుదల చేసింది. తాజాగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మొదటి విడత నిధులనూ కేంద్రం విడుదల చేసింది. గతంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు గ్రామ పంచాయతీలకు నిధులు ఇవ్వకుండా కేంద్రం ఇచ్చిన నిధులను పక్కదారి పట్టించాయి. అయినప్పటికీ.. గ్రామాల అభివృద్ధి కోసం కేంద్రం యుటిలైజేషన్ సర్టిఫికెట్లు సమర్పించగానే నిధులను విడుదల చేసింది. తెలంగాణలో పంచాయతీ ఎన్నికలను రేండెళ్లపాటు నిర్వహించకుండా స్పెషల్ ఆఫీసర్ల పాలనతో రాష్ట్ర ప్రభుత్వం నెట్టుకొచ్చింది. ఇకపైనా ఎప్పటికప్పుడు యుటిలైజేషన్ సర్టిఫికెట్లు సమర్పిస్తే తదనుగుణంగా నిధులను విడుదల చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది' అంటూ ప్రకటన జారీ చేశారు.

# నాడు హైదరాబాద్ అభివృద్ధికి చంద్రబాబు కృషి చేశారు

## రాజ్యసభ ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్

హైదరాబాద్: న్యూస్‌వార్ ప్రతినిధి

దూరదృష్టి గల నాయకుడిగా ఆనాడు హైదరాబాద్ అభివృద్ధికి చంద్రబాబునాయుడు కృషి చేశారని, విభజన తర్వాత ఏపీకి అమరావతి రాజధానిగా సంకల్పం తీసుకుని ముందుకు సాగుతున్నారని తెలంగాణ బీజేపీ నాయకుడు, రాజ్యసభ ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. అమరావతికి ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారని, రెండు రాష్ట్రాల అభివృద్ధికి ఎన్డీయే కట్టుబడి ఉందని అన్నారు. అమరావతి చట్టబద్ధత బిల్లుపై రాజ్యసభలో చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. వికసిత్ ఆంధ్రప్రదేశ్ కోసం వికసిత్ రాజధాని అవసరమని ఆయన అన్నారు. రాజధాని అమరావతి కోసం 29 వేలమంది రైతులు 33 వేల ఎకరాలు ఇచ్చారని గుర్తు చేశారు. భవ్య రాజధాని కోసం ఏపీ ప్రజలు కలలు కన్నారని పేర్కొన్నారు. ప్రధాని మోదీ వికసిత్ భారత్ సంకల్పం సాకారమయ్యేందుకు వికసిత్ ఆంధ్ర నిర్మాణం అవశ్యమన్నారు. రాజధాని అవసరమని, కానీ జగన్ తన హయాంలో మూడు ముక్కలాడి రైతులు, మహిళలను ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించారు. రాజధాని కోసం చాలాకాలంగా పోరాడిన మహిళలకు, రైతులకు ఆయన శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్లు తెలిపారు. అమరావతి బిల్లు కోసం దేశం మొత్తం ఆసక్తిగా చూస్తోందని అన్నారు. తెలుగు వారికి ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కావాలని నాడు పొట్టి శ్రీరాములు 58 రోజులు నిరాహార దీక్ష చేసినా, నాటి కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించలేదని మండిపడ్డారు. ఆంధ్ర రాష్ట్రం కోసం ఆయన ప్రాణాలు త్యాగం చేశారని అన్నారు. ఆయన మరణానంతరం ప్రభుత్వం స్పందించి ఆంధ్ర రాష్ట్రం ఇచ్చిందని అన్నారు.

# హైదరాబాద్ సహా పలు నగరాల్లోని ఐప్యాక్ కార్యాలయాల్లో ఈడీ సోదాలు

హైదరాబాద్: న్యూస్‌వార్ ప్రతినిధి

పశ్చిమ బెంగాల్‌లో బొగ్గు స్మగ్లింగ్ కేసుకు సంబంధించి కేంద్ర దర్యాప్తు సంస్థ ఈడీ ప్రముఖ రాజకీయ కన్సల్టెన్సీ ఐప్యాక్ కార్యాలయాల్లో సోదాలు చేపట్టింది. హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీలోని ఐప్యాక్ కార్యాలయాల్లో ఏకకాలంలో ఈడీ అధికారులు సోదాలు చేపట్టారు. ప్రశాంత్ కిషోర్‌కు చెందిన ఐప్యాక్ ప్రస్తుతం పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ కోసం పని చేస్తోంది. ఐప్యాక్ కన్సల్టెన్సీ డైరెక్టర్లలో ఒకరైన రిషిరాజ్ సింగ్‌కు చెందిన ప్రాంగణంపై కూడా దర్యాప్తు సంస్థ దృష్టి సారించింది. బొగ్గు స్మగ్లింగ్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో కొంతకాలంగా సోదాలు జరుగుతున్నాయి. గతంలో బెంగాల్‌లోని ఐప్యాక్ కార్యాలయాలు, ఐప్యాక్ అధినేత ఇళ్లలో ఈడీ సోదాలు నిర్వహించింది. నాడు సోదాల సమయంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్వయంగా అక్కడకు వచ్చి, మీడియా ఎదుటే ఫైళ్లతో వెళ్తూ కనిపించడం చర్చకు దారితీసింది. సోదాల సమయంలో బెంగాల్ ప్రభుత్వం నుంచి ఆటంకాలు ఎదురయ్యాయని ఈడీ అప్పుడు ఆరోపించింది. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోంది. మరోవైపు, మమతా బెనర్జీ కేంద్ర దర్యాప్తు సంస్థ ఆరోపణలను ఖండించింది. సోదాల పేరుతో ఈడీ తన పరిధిని ఉల్లంఘించిందని ఆరోపించారు.

# ఆ అధికారుల నిర్బంధం తెలియదు.. పాలన నా చేతుల్లో లేదు: మమతా బెనర్జీ

హైదరాబాద్: న్యూస్‌వార్ ప్రతినిధి

మాల్దా జిల్లాలో 'సర్' విధుల్లో ఉన్న ఏడుగురు జ్యుడీషియల్ అధికారులను నిర్బంధించిన విషయం తనకు తెలియదని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తెలిపారు. ఈ నెలలో బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయి. ఈ క్రమంలో అధికారులను నిర్బంధించడం ఆ రాష్ట్రంలో తీవ్ర దుమారం రేపుతోంది. సాగర్‌దిఘిలో జరిగిన బహిరంగ సభలో ఆమె మాట్లాడుతూ, అధికారుల నిర్బంధం తనకు తెలియదని, ప్రస్తుతం పాలన తన చేతుల్లో లేదని స్పష్టం చేశారు. అధికారుల నిర్బంధానికి బాధ్యులు ఎవరో తనకు తెలియదని ఆమె స్పష్టం చేశారు. ఈ విషయమై తనకు ఎవరూ సమాచారం కూడా ఇవ్వలేదని చెప్పారు. పరిపాలన తన చేతుల్లో లేదని, శాంతిభద్రతలను ఎన్నికల సంఘం నియంత్రిస్తోందని తెలిపారు. వారంతా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మాట వింటున్నారని అన్నారు. అధికారులను కూడా కేంద్రం మార్చిందని ఆరోపించారు. తన అధికారాలన్నీ ఈసీ చేతిలోకి వెళ్లాయని అన్నారు. ఓటర్ల జాబితా సమగ్ర సర్వే (ఎస్ఐఆర్)పై ప్రజలు చాలా కోపంగా ఉన్నారని మమతా బెనర్జీ అన్నారు. మాల్దాలో జరిగిన అధికారుల నిర్బంధం ఘటన బీజేపీ కుట్రలో భాగమని ఆమె ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికను రద్దు చేయించి, రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని బీజేపీ భావిస్తోందని అన్నారు. న్యాయాధికారులకు రక్షణ కల్పించడంలో ఎన్నికల సంఘం విఫలమైందని ఆరోపించారు. తనకు అర్ధరాత్రి సమయంలో ఒక జర్నలిస్టు ద్వారా నిర్బంధం విషయం తెలిసిందని వెల్లడించారు.

# అఖిలపక్ష సమావేశానికి మోదీ గైర్హాజరు.. ప్రధాని ఎక్కడని నిలదీసిన ఖర్గే

పార్లమెంట్ వేదికగా అధికార, ప్రతిపక్షాల మధ్య మరోసారి మాటల యుద్ధం జరిగింది. పశ్చిమాసియా సంక్షోభంపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశానికి ప్రధాని మోదీ హాజరుకాకపోవడాన్ని రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే తీవ్రంగా ప్రశ్నించారు. దీనిపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు గట్టిగా బదులివ్వడంతో సభలో కాసేపు వేడి రాజుకుంది. "పశ్చిమాసియా ఉద్రిక్తతలపై మీరు అఖిలపక్ష సమావేశం పెట్టారు. ఆ సమావేశానికి ప్రధానమంత్రి ఎందుకు రాలేదు?" అని ఖర్గే ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. ఇంధన ధరల పెరుగుదల వంటి కీలక అంశాలపై చర్చకు రాకుండా, ప్రభుత్వం తన అజెండాను ప్రతిపక్షాలపై రుద్దుతోందని ఆయన ఆరోపించారు. తాము ప్రతినిధులను పంపినా ప్రధాని రాలేదని, కేవలం ఉపన్యాసాలు వినడానికి తాము రావాలా అని నిలదీశారు. ఖర్గే వ్యాఖ్యలపై కిరణ్ రిజిజు ఘాటుగా స్పందించారు. దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు ప్రతిపక్షాలు రాజకీయం చేయడం దురదృష్టకరమని అన్నారు. అదే అఖిలపక్ష సమావేశానికి లోక్‌సభ, రాజ్యసభలోని ప్రతిపక్ష నేతలు ఎందుకు హాజరు కాలేదని ఆయన ఎదురు ప్రశ్నించారు. ప్రభుత్వం ఏ చర్చ నుంచీ వెనక్కి తగ్గడం లేదని, ఇప్పటికే ఈ అంశంపై ప్రధాని, మంత్రులు ఉభయ సభల్లో ప్రకటనలు చేశారని గుర్తుచేశారు. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధం కారణంగా అంతర్జాతీయంగా చమురు ధరలు పెరుగుతున్నాయి. దీని ప్రభావంతో దేశంలో గ్యాస్, పెట్రోల్ ధరలు పెరగొచ్చని విపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే వ్యూహరచన కోసం ప్రభుత్వం సర్వపక్ష భేటీని ఏర్పాటు చేసింది. అయితే ఈ సమావేశానికి ప్రధాని గైర్హాజరు కావడం రాజకీయ దుమారానికి కారణమైంది.

# ఇరాన్ యుద్ధంపై ఆస్ట్రేలియా ప్రధాని సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్: న్యూస్‌వార్ ప్రతినిధి

పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల నడుమ, అమెరికాకు అత్యంత సన్నిహిత మిత్రదేశమైన ఆస్ట్రేలియా నుంచి అనూహ్య వ్యాఖ్యలు వెలువడ్డాయి. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ కూటమి కొనసాగిస్తున్న దాడుల ఉద్దేశాన్ని ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఆంథోనీ అల్బనీస్ సూటిగా ప్రశ్నించారు. ఈ యుద్ధానికి ముగింపు ప్రణాళిక ఏంటని ఆయన నిలదీశారు. నేషనల్ ప్రెస్ క్లబ్‌లో ప్రసంగించిన అల్బనీస్, "ఇరాన్‌లో ఇంకా సాధించాల్సింది ఏముంది?" అని నేరుగా వేసిన ప్రశ్న అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. ఇరాన్ అణ్వాయుధాలు పొందకుండా నిరోధించడం, దాని సైనిక సామర్థ్యాన్ని తగ్గించడం వంటి అమెరికా ప్రాథమిక లక్ష్యాలకు తాము మద్దతిచ్చామని ఆయన గుర్తుచేశారు. అయితే, ప్రస్తుత దాడులతో ఆ లక్ష్యాలు ఇప్పటికే నెరవేరాయని, అయినప్పటికీ యుద్ధాన్ని ఎందుకు పొడిగిస్తున్నారో అర్థం కావడం లేదని అభిప్రాయపడ్డారు. ఈ సంక్షోభం ఎంతకాలం కొనసాగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు అంత నష్టమని, ముఖ్యంగా ఇంధన ధరలు, సరఫరా వ్యవస్థలపై తీవ్ర ప్రభావం పడుతుందని అల్బనీస్ హెచ్చరించారు. ఈ యుద్ధం ప్రారంభించే ముందు తమను ఎవరూ సంప్రదించలేదని స్పష్టం చేసిన ఆయన, ఆస్ట్రేలియా ఇందులో ప్రత్యక్షంగా పాలుపంచుకోవడం లేదని స్పష్టం చేశారు. అయినప్పటికీ, భౌగోళికంగా దూరంగా ఉన్నా ఆర్థికంగా తాము భారీ మూల్యం చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికాకు కీలక మిత్రపక్షంగా ఉన్న దేశం నుంచి ఇలాంటి విమర్శలు రావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ మోసం చేసింది: హరీష్ రావు

హైదరాబాద్:

కాంగ్రెస్ సర్కార్ రాష్ట్ర యువతను తీవ్రంగా దగా చేసిందని మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, అమలు కాని హామీలలో అధికారంలోకి వచ్చి ప్రజలను నిలువునా ముంచారని అన్నారు. సంగారెడ్డిలో బిఆర్ఎస్ లో చేరికలు కొనసాగాయి. హరీష్ రావు సమక్షంలో పటాన్ చెరు నియోజకవర్గ కాంగ్రెస్ సోషల్ మీడియా ప్రతినిధులు, కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఎండి ఆరిఫ్ సహా 25 మంది చేరారు. గులాబీ కండువాలు కప్పి హరీష్ రావు పార్టీలోకి ఆహ్వానించారు. ఈ



సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ దుర్మార్గాలను చూడలేకే కాంగ్రెస్ పార్టీ వాళ్లు బిఆర్ఎస్ లో చేరుతున్నారని, జాబ్ క్యాలెండర్ లేదు, కొత్తగా ఉద్యోగాల కల్పన లేదని విమర్శించారు. రెండు లక్షల ఉద్యోగాల హామీ పూర్తిగా బోగస్ అయ్యిందని, అవ్వాతాతలకు పెన్షన్లు పెంచలేదని మండిపడ్డారు. మహిళలకు రూ.2500 ఇవ్వలేదని, రైతన్నల హామీలు నెరవేర్చకుండా, రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ మోసం చేసిందని ధ్వజమెత్తారు. ప్రజా సమస్యలు వెలుగులోకి తేవడంలో సోషల్ మీడియాదే కీలకపాత్రని, సోషల్ మీడియాలో ఎప్పటికప్పుడు కాంగ్రెస్ మోసాలను ఎండగట్టాలని హరీష్ రావు సూచించారు.

# భారీగా తగ్గిన బంగారం, వెండి ధరలు..

హైదరాబాద్: న్యూస్‌వార్ ప్రతినిధి

పసిడి ప్రియులకు గుడ్ న్యూస్. గత కొన్ని రోజులుగా తగ్గుతూ.. పెరుగుతూ వస్తున్న బంగారం, వెండి ధరలు మరోసారి భారీగా తగ్గాయి. గురువారం హైదరాబాద్ బులియన్ మార్కెట్ లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరపై రూ.1,530 తగ్గగా.. 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ ధరపై రూ.1,400 తగ్గింది. దీంతో తెలుగు రాష్ట్రాల్లో 24 క్యారెట్ల తులం బంగారం ధర రూ.1,51,420కు చేరుకుంది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ ధర రూ.1,38,800కు తగ్గింది. అలాగే, వెండి ధర కూడా భారీగా తగ్గింది. ఒక్కరోజే రూ.10 వేలు తగ్గడంతో కిలో వెండి ధర రూ.2,55,000కు చేరుకుంది.

# అమరావతిపై రాజకీయ కోణంలో చూసి విమర్శలు చేయవద్దు: బీజేపీ ఎంపీ ఆర్ కృష్ణయ్య

హైదరాబాద్: న్యూస్‌వార్ ప్రతినిధి

ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి అభివృద్ధి అవశ్యమని, దీనిని రాజకీయ కోణంలో చూసి విమర్శలు చేయవద్దని బీజేపీ రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. అమరావతి చట్టబద్ధత బిల్లుపై రాజ్యసభలో చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏపీ రాజధానిగా అమరావతికి పూర్తి మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రం మధ్యలో అమరావతి ఉంటుందని,



పాలనాపరంగా సౌలభ్యంగా ఉంటుందని అన్నారు. రాజధాని అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో కృషి చేశారని అన్నారు. అందరికీ ఆమోదయోగ్యమైన రాజధానిని అందరూ సమర్థించాలని కోరారు. తెలుగు రాష్ట్రాలకు కేంద్రం అన్ని విధాలుగా సహకరిస్తోం దని అన్నారు. నిధులు సమకూరుస్తున్నట్లు చెప్పారు. చంద్రబాబు హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి చేయడాన్ని మనం చూశామని, అలాగే అమరావతిని అభివృద్ధి చేయాలనే తపన ప్రధాని మోదీకి కూడా ఉందని అన్నారు. బలహీనవర్గాల రాజధానిగా అమరావతి రూపుదిద్దు కుంటుందన్న నమ్మకం ఉందని ఆర్ కృష్ణయ్య అన్నారు. అమరావతిని ప్రపంచస్థాయి రాజధానిగా చేయడంలో చంద్రబాబు విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏపీ రాజధాని అభివృద్ధికి సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. రాజధాని అభివృద్ధిని రాజకీయాలకు అతీతంగా చూడాలని ఆర్ కృష్ణయ్య అన్నారు.

న్యూస్ వార్ వార్తా పత్రిక

సంపాదకీయం...

# ఇది ఆదర్శమే కాదు అవసరమే

**తల్లిదండ్రుల సంరక్షణకు తెలంగాణ చారిత్రాత్మక చట్టం అమలులోకి తెచ్చింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తాను ప్రత్యక్షంగా గమనించిన సంఘటనలను ఆయనే స్వయంగా చెబుతుంటే వృద్ధులైన తల్లిదండ్రులు ఎంత నిర్లక్ష్యానికి గురవుతున్నారో తెలుస్తుంది. 'ఒకాయన ప్రజాప్రతినిధిగా చాలా పైకి ఎదిగిండు, ఆయన తండ్రికి క్యాన్సర్ వస్తే అప్పుడు ఆయన మంత్రిగా ఉండి, తండ్రిని కనీసం పట్టించుకోలే.. తండ్రిని బజారుకు తీసుకెళ్లి పండ్లు కూడా కొనివ్వలేని పరిస్థితి ఆయనది.. ఇంట్లో తిండి పెట్టీ పెట్టక భార్య భయానికి తండ్రి యోగక్షేమాలు కూడా పట్టించుకోలేని పరిస్థితి. ఆయన చనిపోతే నాయకులంతా ఆ మాజీమంత్రిని పరామర్శ చేశారే తప్ప ఆ తండ్రి ఎలా చనిపోయాడో ఎవరూ తెలుసుకోలేదు.' ఇలాంటి వాస్తవ సంఘటనలే తెలంగాణ ప్రభుత్వం తల్లిదండ్రుల సంరక్షణ చట్టం తీసుకురావడానికి దోహదం చేశాయి. తల్లిదండ్రుల భరణం, వయోవృద్ధుల సంక్షేమ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం 2007లో అమలులోకి తెచ్చింది. కానీ ఈ చట్టం అమలు కాగితాలకే పరిమితమైంది. తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ చట్టం ప్రత్యేకత ఏమంటే ప్రభుత్వ ఉద్యోగులే కాదు, ప్రైవేట్ సంస్థల ఉద్యోగులు, ఎంఎల్ఎలు వంటి ప్రజాప్రతినిధులకు కూడా ఈ చట్టం వర్తిస్తుంది. ఉద్యోగుల జీతాల్లోంచి 15 శాతం లేదా రూ. 10 వేలు వంతున ఏది తక్కువ మొత్తం అయితే దానినే తల్లిదండ్రుల సంక్షేమం కోసం బదిలీ చేస్తారు. ఈమేరకు సమర్థంగా నిర్వహించడానికి ఒక సంస్థాగత యంత్రాంగాన్ని ప్రతిపాదించడం ద్వారా తెలంగాణ ప్రభుత్వం ఒక అడుగు ముందుకేసింది. మాతృదేవోభవ, పితృదేవోభవ అనే ఆదర్శాన్ని తరచుగా ప్రస్తావించే మన దేశంలో ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న చర్య ఒక అత్యవసరాన్ని ప్రతిబింబిస్తుంది.**

కేంద్ర ప్రభుత్వం తీసుకున్న తల్లిదండ్రుల సంక్షేమ చట్టం ఎందుకు సరిగ్గా అమలు కావడం లేదన్న ప్రశ్న ఎదురవుతోంది. అంటే అమలు చేసే యంత్రాంగంలో చిత్తశుద్ధి లోపించడమే. 2021లో దేశంలో నిర్వహించిన దీర్ఘకాలిక వృద్ధాప్య అధ్యయనం ప్రకారం 2020లో దేశంలో 5.2 శాతం మంది వృద్ధులు తమ కుటుంబీకుల నుంచే లేనిపోని మాటల వేధింపులకు గురయ్యారని తేలింది. తెలంగాణలో ఇలాంటి మాటల వేధింపుల బాధితుల సంఖ్య 2.1 శాతం వరకు ఉందని అధ్యయనంలో బయటపడింది. బాధితులైన వయోవృద్ధుల్లో సగానికి పైగా తమను కుటుంబం నిర్లక్ష్యం చేసిందని నివేదించారు. ఇప్పుడు ఆ వేధింపులు తెలంగాణలో 68% వరకు పెరిగిపోవడం విడ్డూరం. ఇవన్నీ ఆయా వృద్ధులు ఫిర్యాదులు చేస్తేనే తెలిశాయి. మరి వాస్తవానికి చాలావరకు ఫిర్యాదులు చేయలేని సంఘటనలు ఎన్నో ఉన్నా వెలుగు లోకి రావడం లేదు. దీనికి కారణం కుటుంబం పరువు పోతుందనే సామాజిక ధర్మం పాటించి సహనం వహించడం, అలాగే బయటకు చెప్పకూడదని ఒత్తిళ్లు రావడం అని తెలుస్తోంది. తల్లిదండ్రులకు, పిల్లలకు మధ్య సహజంగా ఉండవలసిన అనుబంధంలో చట్టం జోక్యం చేసుకోవలసిరావడం దురదృష్టకరంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులను ఎవరైతే నిర్లక్ష్యం చేస్తున్నారో వారు సామాజిక వ్యతిరేకతను ఎదుర్కొంటే తప్ప వారికి గుణపాఠం రాదని ముఖ్యమంత్రి సీరియస్‌గా చేసిన వ్యాఖ్యలను తప్పు పట్టవలసిన అవసరం లేదు. ఈ సమస్య తీవ్రతను అర్థం చేసుకోక తప్పదు. తల్లిదండ్రులను, పెద్దలను దైవంతో సమానమైన ఉన్నత పీఠంపై మన భారత దేశ నాగరికతా సంస్కృతి పట్టంకట్టి ఆరాధిస్తోంది. అయితే దీనికి పూర్తి విరుద్ధంగా నేడు చాలా మంది వృద్ధులు భావోద్వేగపరమైన వేధింపులను ఎదుర్కొంటుండడం అత్యంత శోచనీయం. తాము పెంచి పోషించిన పిల్లలే తమ సొంత ఆస్తిని గుప్పిటలో పెట్టుకుని తమకు పిడికెడు మెతుకులైనా పెట్టకుండా పీడించడం లేదా స్వంత ఇంటిలోనే నిలువనీడనీయకుండా చివరికి ఊరవతల శ్మశాన వాటికకు బతికి ఉండగానే తరలించడం వంటి దారుణాలు జరుగుతున్నాయి. ఈ అమానవీయ, నైతిక సంక్షోభం ఈ చట్టం వల్ల సమసిపోతుందా? అన్న ప్రశ్న తలెత్తక మానదు. కేంద్రం 2021లో తల్లిదండ్రుల సంరక్షణ చట్టం ఎప్పుడైతే అమలులోకి తెచ్చిందో ఢిల్లీ, హిమాచల్‌ప్రదేశ్, తమిళనాడు వంటి రాష్ట్రాల్లోనూ తల్లిదండ్రుల సంరక్షణ చట్టాలు అమలులోకి వచ్చాయి. మాదిగలు రాజకీయంగా ఎదగాలి కానీ సమస్య మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంటోంది. అయినప్పటికీ ఈ చట్టాన్ని సమస్య తీవ్రత దృష్ట్యా పకడ్బందీగా అమలు చేయడం ప్రభుత్వాల కర్తవ్యం. ఈ చట్టంపై విస్తృత అవగాహన కల్పించి సజావుగా అమలయ్యేలా మద్దతు ఇవ్వాలి. ఎవరికి వారు సొంతంగా బతుకుదామని, ఎంతో కొంత సంపాదించుకుందామని స్వతంత్రంగా నిర్ణయించుకోవడంతోనే ఉమ్మడి కుటుంబాలు చిన్నచిన్న పరిమిత కుటుంబాలుగా చీలిపోతున్నాయి. ఈ కుటుంబాలు బాగా అభివృద్ధి సాధించాలని తాపత్రయం పడడంలో తప్పులేదు. కానీ తల్లిదండ్రులు తాము పంచి ఇచ్చిన ఆస్తులను తిరిగి అప్పచెప్పాలని అడగడం లేదు. కుటుంబంలో తమ స్థానాన్ని అడుగుతున్నారు. జీతం ఇచ్చే యజమానికోసం కొన్ని గంటలు పనిచేస్తాం. కానీ జీవితం ఇచ్చే తల్లిదండ్రుల కోసం ఒక్క నిమిషమైనా వెచ్చించలేమా? చట్టం పేరిట కుటుంబాలను బలవంతంగా మెడలు వంచినంత మాత్రాన తల్లిదండ్రులకు సంరక్షణ కల్పించినట్టు కాదు. విస్తృతమైన నాగరికతా సాంస్కృతిక పునరుద్ధరణ పుట్టుకు రావాలి.

# చేనేతలకు ఇచ్చిన ఉచిత విద్యుత్ హామీ అమలు

### చేనేత మగ్గాలకు నెలకు 200 యూనిట్లు

### మరమగ్గాలకు నెలకు 500 యూనిట్లు

### ఏటా ప్రభుత్వం 150కోట్ల భారం

### వెల్లడించిన మంత్రి గొట్టిపాటి



**అమరావతి,**

ఇచ్చిన హామీ మేరకు చేనేత మగ్గాలకు నెలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు నెలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌అన్నారు. ఈ పథకం ద్వారా ఏటా ప్రభుత్వం రూ.150కోట్లు పైనే భరిస్తోందని మంత్రి వెల్లడించారు. ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా నెరవేర్చుతూ జగన్ నాశనం చేసిన విద్యుత్ వ్యవస్థను ముఖ్యమంత్రి చంద్రబాబు తన అపార అనుభవంతో గాడిలో పెడుతున్నారని మంత్రి అన్నారు. 22 నెలలుగా విద్యుత్ ఛార్జీలు పెంచకుండా ట్రూడౌన్ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిది అని చెప్పుకొచ్చారు. యువగళం పాదయాత్రలో చేనేతలకు నారా లోకేశ్ ఇచ్చిన హామీ నేటి నుంచి అమల్లోకి రానుందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. అనంతపురం జిల్లా ధర్మవరం నియోజకవర్గంలో పాదయాత్ర సందర్భంగా చేనేతలు పడుతున్న కష్టాలను చూసిన లోకేశ్ వారికి ఇచ్చిన హామీని ఎన్నికల మేనిఫెస్టోలో కూటమి చేర్చిందని తెలిపారు. జగన్ చేసిన నష్టాలను సరిదిద్దుతూనే రైతులు, చేనేతలు, ఆక్వా, సలూన్‌లకు సబ్సిడీలు ఇస్తున్నామని అన్నారు. వినూత్న ఆలోచనలతో సోలార్, విండ్, పంప్‌డ్ స్టోరేజ్, బ్యాటరీ స్టోరేజ్, గ్రీన్ హైడ్రోజెన్ విధానాలతో విద్యుత్ కొనుగోళ్ల భారాన్ని తగ్గించుకుంటున్నామని తెలిపారు. బయట నుంచి విద్యుత్ కొనుగోళ్లు తగ్గించి.. చరిత్రలో లేని విధంగా రికార్డు స్థాయిలో విద్యుత్ ఉత్పత్తి పెంచామని మంత్రి రవికుమార్ తెలిపారు. ఓల్టేజ్ సమస్యలు పరిష్కరించేందుకు పెద్దఎత్తున సబ్ స్టేషన్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. చంద్రబాబుకు ఉన్న అపార అనుభవంతో విద్యుత్ సంస్కరణలు ఇంతటితో ఆగేవి కాదని.. రానున్న రోజుల్లో ప్రజలకు మరింత వెసులుబాటు కల్పించేలా మార్పులు తీసుకొస్తామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు.ఇదిలావుంటే పెండింగ్‌లో ఉన్న వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను సీజన్ ప్రారంభమయ్యే నాటికి మంజూరు చేయాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు. విద్యుత్ అంతరాయాలు లేకుండా అవసరమైన అన్ని చర్యలూ చేపట్టినట్లు చెప్పారు. ఆర్డీఎస్ఎస్, పీఎం సూర్యఘర్, వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, లోవోల్టేజీ సమస్యలపై సీపీడీసీఎల్, నెడ్‌క్యాప్ అధికారులతో సమీక్షించారు. 'గ్రామీణ ప్రాంతాల్లో లోవోల్టేజీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి. కొనుగోలు వ్యయం తగ్గించుకోవడానికి పునరుత్పాదక విద్యుత్ వినియోగం పెంచుకోవాలి. నియోజకవర్గానికి ఒక నమూనా సోలార్ గ్రామాన్ని అభివృద్ధి చేయాలి. విద్యుత్ వినియోగదారుల సంతృప్తస్థాయిని 90 శాతానికి పెంచాలని ఆదేశించారు. సౌర విద్యుత్ వినియోగాన్ని విస్తృతం చేసే దిశగా.. పీఎం సూర్యఘర్ కనెక్షన్లు మంజూరు చేయాలని రవికుమార్ అన్నారు. 'ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు ఉచిత సౌర విద్యుత్ కనెక్షన్లతో పాటు వేసవి ముగిసే నాటికి ప్రతి నియోజకవర్గంలో 6 వేల సూర్యఘర్ కనెక్షన్లు ఇవ్వాలి. ఆర్డీఎస్ఎస్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలి. సీపీడీసీఎల్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న 11 వేల వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లను తక్షణం ఇవ్వాలి. వినియోగదారుల అనుమతితో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు.

## చేనేత రంగానికి ఊతమిచ్చే దిశగా ప్రభుత్వం నిర్ణయం

### ఉచిత విద్యుత్‌తో తీరనున్న కష్టాలు

### ఎక్స్ వేదికగా పవన్ కళ్యాణ్ పోస్ట్

**అమరావతి,**

ఆంధ్రప్రదేశ్‌లో చేనేత రంగానికి ఊతమిచ్చే దిశగా కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. ఈ పథకం ద్వారా చిన్న చేనేత కుటుంబాలకు ఉపశమనం కలిగించడమే లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ఇవాళ్టి నుంచి అమలులోకి వచ్చిన ఉచిత విద్యుత్ పథకం చేనేత రంగానికి బలాన్నిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ పథకం కింద ప్రతి మగ్గానికి నెలకు 200 యూనిట్లు, మర మగ్గానికి 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందజేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 93 వేల చేనేత మగ్గాలు, 11,488 పవర్ లూమ్ యూనిట్లు ఈ పథకం ద్వారా లబ్ది పొందనున్నట్లు వెల్లడించారు. ఉత్పత్తి వ్యయం తగ్గి, చేనేత కుటుంబాలకు ఆర్థికంగా కొంత ఊరట కలగనుందని నిపుణులు చెబుతున్నారు. పవన్ కళ్యాణ్ తన సందేశంలో గతాన్ని కూడా గుర్తు చేసుకున్నారు. 2017లో నేతన్నలు తమ సమస్యలు వివరించినప్పుడు తనకు తీవ్రంగా బాధ కలిగిందని తెలిపారు. అప్పటినుంచే చేనేత రంగానికి అండగా నిలవాలని నిర్ణయించుకున్నానని, చేనేత బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించానని చెప్పారు. వారంలో ఒక రోజు చేనేత వస్త్రాలు ధరించాలని ఇచ్చిన పిలుపు యువతలో మంచి స్పందన తెచ్చిందని పేర్కొన్నారు. అలాగే నివార్ తుపాను సమయంలో వెంకటగిరి ప్రాంతంలో చేనేత మగ్గాలకు జరిగిన నష్టాన్ని ప్రత్యక్షంగా చూసి బాధపడ్డానని, అప్పుడు ఇచ్చిన భరోసాను నెరవేర్చే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. గత 21 నెలల కాలంలో కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లుగా భావించి ముందుకు సాగుతోందని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఉచిత విద్యుత్ పథకం ద్వారా లబ్ది పొందబోతున్న ప్రతి చేనేత కుటుంబానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## చేనేతరంగానికి ఉచిత విద్యుత్

### ఇంటింటా కరపత్రాలు పంచిన మంత్రి అనిత

**అనకాపల్లి,**

పాయకరావుపేట నియోజకవర్గంలో హోం మంత్రి అనిత పర్యటించారు. ఈరోజు(బుధవారం) ఉదయం నక్కపల్లి చేరుకున్న మంత్రికి మహిళలు ఘన స్వాగతం పలికారు. అనంతరం నక్కపల్లిలో ఇంటింటికి వెళ్లి పెన్షన్లను పంపిణీ చేశారు. నేతన్న జీవితాల్లో సరికొత్త వెలుగులంటూ కరపత్రాలు పంచుతూ ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. చేనేత మగ్గాలకు 200 యూనిట్లు కరెంట్ ఉచితంగా అందిస్తున్నామంటూ చేనేత కార్మికులకు తెలియజేశారు. నక్కపల్లిలో చేనేత కార్మికులతో మాట్లాడిన హోంమంత్రి.. వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చేనేత కార్మికురాలితో కలిసి హోంమంత్రి అనిత మగ్గం నేశారు. ఆ కార్మికురాలి వద్ద చీరను కొనుగోలు చేశారు. కరెంట్ బిల్లు భారాన్ని తగ్గించి చేనేత కార్మికులకు మెరుగైన ఆదాయం కల్పించడమే తమ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. అనంతరం బోదుగలం సమీపంలోని ఆర్ అండ్ ఆర్ కాలనీలో గృహాల ప్రారంభోత్సవ కార్యక్రమంలో హోం మంత్రి అనిత పాల్గొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని మంత్రి అనిత పేర్కొన్నారు. ఇవాళ్టి నుంచి అమలులోకి వచ్చిన ఉచిత విద్యుత్ పథకం చేనేత రంగానికి బలాన్నిస్తుందని ఆమె అభిప్రాయపడ్డారు. ఈ పథకం కింద ప్రతి మగ్గానికి నెలకు 200 యూనిట్లు, మర మగ్గానికి 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందజేయనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 93 వేల చేనేత మగ్గాలు, 11,488 పవర్ లూమ్ యూనిట్లు ఈ పథకం ద్వారా లబ్ది పొందనున్నట్లు వెల్లడించారు. ఉత్పత్తి వ్యయం తగ్గి, చేనేత కుటుంబాలకు ఆర్థికంగా కొంత ఊరట కలగనుందని చెబుతున్నారు. లోకేశ్ పాదయాత్రలో వారి బాధలు గుర్తించారని చేనేత రంగానికి అండగా నిలవాలని నిర్ణయించుకున్నానని, చేనేత బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించానని చెప్పారు.

## అమరావతి బిల్లుకు లోక్‌సభ ఆమోదం

### సభలో బిల్లు ప్రవేశ పెట్టిన నిత్యానంద రాయ్

### చర్చలో పాల్గొన్న 11 పార్టీల ఎంపిలు

### ఏకగ్రీవంగా ఆమోదించిన సభ

### వైకాపా సభ్యుల వాకౌట్

**న్యూఢిల్లీ,**

ఏపీ రాజధాని అమరావతికి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఏపీ పునర్విభజన చట్ట సవరణ పేరుతో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ లోక్‌సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టారు. అనంతరం సుమారు రెండు గంటలపాటు దీనిపై చర్చ జరిగింది. తెదేపా, భాజపా, జనసేన, కాంగ్రెస్, వైకాపా, సమాజ్‌వాదీ సహా పలు పార్టీల ఎంపీలు చర్చలో పాల్గొన్నారు. అనంతరం బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపినట్లు స్పీకర్ స్థానంలో ఉన్న తెన్నేటి కృష్ణప్రసాద్ ప్రకటించారు.ఈ బిల్లు గురువారం రాజ్యసభ ముందుకు రానుంది. లోక్‌సభలో ఆమోదం పొందిన అనంతరం ఈ బిల్లు రాజ్యసభకు వచ్చినట్లు సెక్రటరీ జనరల్ ప్రకటించారు. గురువారం కేంద్ర మంత్రి నిత్యానంద రాయ్ దీన్ని రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి మొదలు దాదాపు గంటసేపు బిల్లుపై చర్చ జరిగే అవకాశం ఉంది. అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలపడంతో ఈ బిల్లుకు ఆమోదం లభించింది. వైసీపీ మినహా మిగిలిన పార్టీలు బిల్లుకు మద్దతు తెలిపాయి. అమరావతి బిల్లుపై చర్చలో 11 పార్టీలకు చెందిన 18 మంది ఎంపీలు పాల్గొన్నారు. చర్చ తర్వాత అమరావతి చట్టబద్ధత బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపినట్లు స్పీకర్ ప్రకటించారు. అమరావతి రైతుల త్యాగం అపారమైందని పలువురు ఎంపిలు అన్నారు. లోక్‌సభలో ఎంపీ మాట్లాడుతూ.. రైతుల త్యాగం ప్రపంచ చరిత్రలో నిలిచిపోతుందని తెలిపారు. రైతు భూమి కేవలం ఆస్తి కాదని, అది వారి జీవితంతో సమానమన్నారు. తండ్రికి బిడ్డతో ఉండే అనుబంధం ఎలా ఉంటుందో రైతుకు భూమితో బంధం ఉంటుందని వివరించారు. నవ్యాంధ్రప్రదేశ్ నిర్మాణం కోసం, భావితరాల భవిష్యత్తు కోసం రైతులు తమ వ్యక్తిగత ప్రయోజనాలను పక్కన పెట్టి సుమారు 33 వేల ఎకరాల భూమిని రాజధాని నిర్మాణానికి స్వచ్ఛందంగా ఇచ్చారన్నారు. ఈ త్యాగం చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తుంది తెలిపారు. వైసీపీ నేతలు అమరావతిని తక్కువ చేసి మాట్లాడారని మండిపడ్డారు. అమరావతి అంశంపై పార్లమెంట్‌లో చర్చ జరుగుతున్న సమయంలో వైసీపీ సభ్యులు వాక్‌అవుట్ చేయడం దురదృష్టకరమన్నారు. ఇది రాష్ట్ర ప్రజల భావోద్వేగాలను అవమానించినట్లే పలువురు ఎంపిలు తెలిపారు.

## అమరావతి ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక

### రాజధానిపై ఉన్న సందిగ్ధతకు ఇక తెరపడినట్లే

### ఎక్స్ వేదికగా సిఎం చంద్రబాబు హర్షం

**అమరావతి**

లోక్‌సభలో అమరావతి చట్టబద్ధత బిల్లు ఆమోదం పొందడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించారు. అమరావతి భవిష్యత్తుపై ఉన్న సందిగ్ధతకు తెరపడిందన్నారు. లోక్‌సభలో బిల్లు ఆమోదం పొందడం ఆంధ్రులకు దక్కిన గౌరవంగా పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర నిర్మాణంలో ఇది ఒక కీలక మైలురాయని సోషల్ మీడియా ఎక్స్‌లో సీఎం పోస్ట్ చేశారు. ప్రజా రాజధాని అమరావతి ఆంధ్రుల ఆత్మగౌరవానికి ప్రతీక అని సీఎం అన్నారు. ఈరోజు లోక్‌సభలో అమరావతికి చట్టబద్ధత కల్పించే బిల్లు ఆమోదం పొందడం ఆంధ్రులకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు తెలిపారు. గత పాలనలో ఎదురైన చీకట్లు తొలగిపోయి, అమరావతి భవిష్యత్తుపై ఉన్న సందిగ్ధతకు శాశ్వతంగా తెరపడిందని సీఎం పేర్కొన్నారు. రైతుల త్యాగానికి, ప్రజల ఆకాంక్షలకు దక్కిన గౌరవం ఇదన్నారు. స్వర్ణాంధ్ర నిర్మాణంలో ఇది ఓ కీలక మైలురాయన్నారు. అమరావతి ఇక అజేయం.. అజరామరం అని అన్నారు సీఎం. రాజధానిని విశ్వనగరంగా తీర్చిదిద్ది ప్రపంచ పటంలో నిలుపుతామని స్పష్టం చేశారు. సహకరించిన కేంద్ర ప్రభుత్వానికి, ప్రధాని నరేంద్ర మోదీకి, హోం మంత్రి అమిత్ షాకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. లోక్‌సభలో బిల్లుకు మద్దతు పలికిన అన్ని పార్టీలకు ఆంధప్రదేశ్ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తూ సీఎం చంద్రబాబు ట్వీట్ చేశారు.

న్యూస్ వార్
వార్తా పత్రిక

# 20వ వార్డులో ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక సమీక్ష



**న్యూస్ వార్ చౌటుప్పల్ :**

ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ లో భాగంగా చౌటుప్పల్ మున్సిపాలిటీలోని 20వ వార్డు లో మున్సిపల్ కమిషనర్ ట్రైని ఎస్ స్వప్న, వార్డ్ ఆఫీసర్ దంతాల పవన్ మరియు వార్డ్ కౌన్సిలర్ మొహమ్మద్ హాన్ను భాయ్ లు వార్డు ప్రజలు తో కలిసి రాబోవు రోజుల్లో జరగవలసిన కార్యచరణ మరియు వార్డులో ఉన్నటువంటి సమస్యలు వాటి పరిష్కారాల గురించి వార్డు ప్రజల సమక్షంలో చర్చించడం జరిగింది. అర్హులైన వారికి పింఛన్లు, ఇందిరమ్మ ఇండ్లు, గ్యాస్ కనెక్షన్ సబ్సిడీ ,ఉచిత కరెంటు, ముఖ్యంగా దోమలు, పందులు, కోతుల నివారణ అదేవిధంగా స్మశాన వాటిక యొక్క ప్రహరీ గోడ నిర్మాణం, నాగులకుంట డెవలప్మెంట్ గురించి చర్చించి, తీర్మానించడం జరిగినది. వార్డులో ఉన్న ఖూాజ స్కూల్ ప్రస్తుతం ఎనిమిదో తరగతి వరకు ఉన్నది ఇందులో రానున్న విద్యా సంవత్సరానికి 9 మరియు 10వ తరగతులకు అనుమతులు ఇవ్వవలసిందిగా కోరడం జరిగింది. ఈకార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ బాబా షరీఫ్, వార్డు అధ్యక్షులు ఉడుగు వెంకటేశం, వహీద్ భాయ్, మైనారిటీ నాయకులు ఎండీ ఆరిఫ్, రఫీ,షాది ఖానా చైర్మన్ కరీం, అతర్ పాషా, షాది ఖానా మాజీ చైర్మన్ ఎజాస్ పాష, ఊడుగు శివ, ముషీర్, ఆమీర్, ఫయాజ్,అబ్బు,ఘని తదితరులు పాల్గొన్నారు.

# చౌటుప్పల్ లో హనుమాన్ విజయోత్సవ ర్యాలీ



**న్యూస్ వార్ చౌటుప్పల్**

హనుమాన్ జయంతి సందర్భంగా పట్టణంలోని పెరుమాండ్ల ఆంజనేయస్వామి దేవస్థానం నుండి హనుమాన్ శోభాయాత్ర అత్యంత వైభవంగా ప్రారంభించారు. దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చౌటుప్పల్ మున్సిపాలిటీ చైర్ పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్ జెండా ఊపి స్వామి వారి శోభాయాత్ర ప్రారంభించారు. కాషాయ వస్త్రాలతో భక్తులు, జై హనుమాన్ అంటూ చేసిన విజయనాదాలతో, పట్టణమంతా మారుమోగిపోయింది. టపాసులు కాలుస్తూ, ఆటపాటలతో జైశ్రీరామ్. జై హనుమాన్ నినాదాలతో పుర వీధుల గుండా సాగిన ఈ విజయోత్సవ ర్యాలీలో పట్టణ ప్రజలు, భక్తులతో పాటు వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్ కౌన్సిలర్ దేప రమ్య రాజు, మార్కెట్ డైరెక్టర్ పబ్బు శ్రీకాంత్ గౌడ్ ,మాజీ కౌన్సిలర్లు దండే అరుణ్ కుమార్, బొడిగె బాలకృష్ణ, పోలోజు శ్రీధర్ బాబు, భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు.,

# ప్రజా పాలనలో గ్రామసభ

## ఎమ్మెల్యే,తెల్లం.వెంకట్రావు, సర్పంచ్,పూనెం.కృష్ణ దొర,

భద్రాచలం గ్రామ పంచాయతీ కార్యాలయంలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా గ్రామపంచాయతీల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో భద్రాచలం మేజర్ గ్రామపంచాయతీలో గ్రామసభ కార్యక్రమం నిర్వహించారు. గ్రామాభివృద్ధి ,సంక్షేమ పథకాల అమలు, ప్రజల సమస్యలు వంటి అంశాలపై గ్రామసభలో చర్చలు జరిగాయి. ప్రజలు తమసమస్యలను నేరుగాఅధికారులదృష్టికితీసుకెళ్లగా,పరి ష్కారానికిచర్యలుతీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పూనెం. కృష్ణ,ఉపసర్పంచ్ రత్నం కవిత గారు,వార్డు సభ్యులు సూరే. వెంకటచెంచుసుబ్బారావు, బొంబోతుల.రాజీవ్,బొం త.రమణ, బండారు.శరత్ బాబు,నర్రా వాణి, అబ్బినేని.వినీల రాణి,కాపూరి.గోపి, పెద్దినేని.లక్ష్మి,కారం.సుజాత,



నిట్టా రాజు,భూక్యసుశీల,కార ందుర్గారావు, తాటి.ఉదయ్ కుమార్,ఇలమలఅశోక్ కుమార్,సున్నం ఈశ్వరమ్మ,సున్నం భూలక్ష్మి,జగ్గా కుమారి, తుర్రం మహేష్,ఇర్పా అనసూర్య పాల్గొన్నారు.అలాగే గ్రామపంచాయతీ ఈఓ శ్రీనివాస్,ఎం ఈ ఓ రమ,విద్యుత్ శాఖ ఏఈ రాజారావు,ఆర్ఐనాగేంద్రప్రసాద్,ప్ర జాప్రతినిధులు,అ ధికారులు,గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సర్వాయి పాపన్నకు ఘనంగా నివాళులు అర్పించిన ఎల్లగిరి గౌడ సంఘం

**న్యూస్ వార్ చౌటుప్పల్ :**

సర్దార్ సర్వాయి పాపన్న 316 వ వర్థంతిని ఎల్లగిరి గ్రామ కంఠమహేశ్వర గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన అనంతరం, అధ్యక్షులు మారగోని అశోక్ గౌడ్ మాట్లాడుతూ, బడుగు బలహీన వర్గాలపై జరుగుతున్న దౌర్జన్యానికి భూస్వాములు, పెత్తందార్లకు వ్యతిరేకంగా గోల్కొండ కుతుబ్ షాహీల తో పోరాడి గోల్కొండ కోటను స్వాధీనం చేసుకొని పరిపాలించిన వీరుడు సర్దార్ పాపన్న అన్నారు. మొఘల్ చక్రవర్తులపై దండెత్తిన మొదటి తెలంగాణ పోరుబిడ్డ,గా కీర్తించారు, కార్యదర్శి మారగోని జంగయ్య గౌడ్ మాట్లాడుతూ భూమి శిస్తుకు వ్యతిరేకంగా పోరాడి, జాగీర్దారులు, దొరలు, చేసే దురాగతాలను ఎదురించి బానిసత్వ నుండి విముక్తి కల్పించాలని గోల్కొండ కోటపై బహుజనుల జెండా ఎగుర వేసిన ధీరుడని కొనియాడారు. గ్రామ సర్పంచ్ రిక్కల మహేందర్ రెడ్డి మాట్లాడుతూ కుల, మత, జాతి వర్గ విభేదాలు లేని సమాజం కోసం దాదాపు 350 ఏండ్ల కిందనే కృషి చేసిన బహుజన పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్. తొలి బహుజన రాజ్య స్థాపన చేసిన గొప్ప వీరుడు, శివాజీ ముస్లింల పాలన అంతానికి మహారాష్ట్రలో ఎలాగైతే పోరాడాడో, పాపన్న కూడా తెలంగాణలో మొఘలుల పాలన అంతానికై పోరాడాడని. తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ కందగట్ల సురేందర్ రెడ్డి వార్డ్ సభ్యులు బాలగోని శివ యాదవ్,



మేకల సందీప్ రెడ్డి ,కొత్త ప్రవీణ్ యాదవ్, కొత్త బాలరాజు యాదవ్, సెక్రటరీ భవాని, దయాకర్, మల్లేశం,శ్రీను, శంకరయ్య, పల్సం అంజయ్య గౌడ్, చిన్న అంజయ్య, డోనూరి ప్రవీణ్ రెడ్డి, గుడ్డేటి మల్లేష్ యాదవ్, పాండు రెడ్డి,నవ్య,సాయి రెడ్డి రామిరెడ్డి నోముల రాంరెడ్డి, సుర్కంటి కుమార్ రెడ్డి,బాలగోని లక్ష్మమ్మ, గుడ్డేటి మల్లేష్,కొలకపల్లి శివమ్మ,కొత్త భారతమ్మ, కొత్త శంకరయ్య, కొత్త లచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

# కిడ్నాప్ కేసులో పదిమంది నిందుతులను అరెస్ట్ చేసిన ముదిగొండ పోలీసులు

2026 మార్చి 25 న తెల్లవారుజామున పండ్రెగుపల్లి గ్రామ మాజీ సర్పంచ్ / ప్రస్తుత సర్పంచ్ భర్త అయిన పాము సిల్వరాజు ఉదయం తన ఇంటి నుండి బయలుదేరి వాకింగ్ చేసుకుంటూ ఖానాపురం వైపు వెళుతుండగా... ఊరి శివారులో గల బాబా సాహెబ్ మొక్కజొన్న చేను దగ్గరలోకి వెళ్ళే సరికి అశోక్ లేలాండ్ వాహనంలో గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేసినారని, గత కొంతకాలంగా సిల్వరాజుపై అదే గ్రామానికి చెందిన షేక్ ఫక్రుద్దీన్ అతని కొడుకులు షేక్ బోధలు సాహెబ్, షేక్ ఖాసిం సాహెబ్ అనువారు వారి పాలివాండ్ల భూమి తగాదా విషయంలో మాట్లాడుతున్నాడని కోపంతో ఉన్నారని వారే సిల్వరాజును పాత కక్షలను మనసులో పెట్టుకొని కిడ్నాప్ చేసి ఉంటారని శివరాజు భార్య పాము స్వర్ణలత ఇచ్చిన పిర్యాదుపై ముదిగొండ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసినారు. కిడ్నాప్ ను సవాలుగా తీసుకున్న పోలీస్ లు ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి ఆదేశాల మేరకు, ముదిగొండ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ మురళి సారధ్యంలో ఎస్సై అశోక్ తో పాటుగా సిబ్బందిని రెండు ప్రత్యేక బృందాలుగా ఏర్పాటు చేసి హైదరాబాద్ వారి లొకేషన్ ట్రేస్ చేస్తూ సిల్వరాజు ను గంటల వ్యవధిలోనే ట్రేస్ చేయటం జరిగినది.

పండ్రెగుపల్లి లో షేక్ ఇబ్రాహీం, షేక్ ఫక్రుద్దీన్ అను అన్నదమ్ములకు (08) ఎకరాల భూమి పంపకాల విషయంలో తగదా ఉన్నది. షేక్ ఫక్రుద్దీన్ తన తల్లిదండ్రులను పట్టించుకోకుండా హైదరాబాద్ లో ఉంటున్నందున షేక్ ఇబ్రాహీం తన తల్లి దండ్రులను పోషించాడు. తల్లిదండ్రులను పోషించినందుకు ఆ ఊరిలో ఉన్న పెద్ద మనషులు షేక్ ఇబ్రాహీం కు (03) ఎకరాల భూమిని ఇవ్వమని చెపుతారు, అందులో సిల్వరాజు కూడా గట్టిగా షేక్ ఇబ్రాహీంకు సపోర్ట్ చేస్తాడు. ఈసంవత్సరం జనవరి నెలలో షేక్ ఫక్రుద్దీన్, అతని కొడుకులు బోదల సాహెబ్ ఏ ముస్తఫా, షేక్ ఖాసిం సాహెబ్ కలిసి హైదరాబాద్ నుండి కిరాయి మనుషులని









తీసుకు వచ్చి ఫెన్సింగ్ వేస్తుండగా, ఈ విషయం తెలిసి పాము సిల్వరాజు జనాలను తీసుకు వచ్చి ఫెన్సింగ్ వేయకుండా అడ్డుకున్నాడు. పాము సిల్వరాజు ప్రతి దాంట్లో అడ్డుపడుతున్నాడు, అతను బతికి ఉండగా భూమి వారికి దక్కదని, అతడిని ఎలాగైనా అంతం చేయాలని వీరు ముగ్గురు తండ్రి కొడుకులు కలిసి పథకం పన్ని హైదరాబాద్ కు చెందిన బోదల్ సాహెబ్ స్నేహితులైన (1) సయ్యద్ మహమ్మద్ ఏ బాబా, (2) మెయిర్బాన్ సింగ్, (3) డంగి సిక్లికర్ కులజీత్ సింగ్, (4) డంగి సిక్లికర్ ఆజాద్ సింగ్, (5) ఇస్మాయిల్, (6) కోమల (7) వీణ. నూర్ (8) వరికుప్పల తారుణ్ అను ట్రాలీ ఆటో డ్రైవరు అను కిరాయి మనుషులను సిల్వరాజును చంపితే 15 లక్షలు శుపారీ ఇచ్చే విధంగా మాట్లాడినారు. అడ్వాన్స్ గా 5 లక్షలు యిచ్చినారు. వారు అనుకున్న పథకం ప్రకారంగా పై ఎనిమంది వ్యక్తులు ఒక అశోక్ లేలాండ్ ట్రక్, ఒక స్విఫ్ట్ డిజైర్ వాహనంలో కత్తులు, ఇనుప రాడ్లు, పెట్రోల్ క్యాన్ వేసుకని తేదీ. 24.03.2026 న రాత్రి బయలు దేరి తెల్లవారి అనగా 25.03.2026 ఉదయం సమయంలో సిల్వరాజు ఖానాపురం రోడ్డుకు వాకింగ్ కు వస్తాడని తండ్రీ కొడుకులు ఇచ్చిన సమాచారం మేరకు అతడి కోసం ఎదురు చూస్తుండగా సిల్వరాజు ఒంటరిగా నడుచుకుంటూ వస్తుండగా బలవంతంగా అతడిని వారి వాహనంలో ఎక్కించుకుని కొట్టుకుంటూ చంపుతామని బెదిరిస్తూ, ఎవరూ గుర్తు పట్టకుండా మధ్యలో స్విఫ్ట్ డిజైర్ వాహనంలోకి మార్చి అక్కడి నుండి కొట్టుకుంటూ హైదరాబాద్ తీసుకు వెళ్ళినారు. ఇక్కడ బయలు దేరిన దగ్గర నుండి ప్రతి విషయం సయ్యద్ మహమ్మద్ ఏ బాబా, వీడియో తీస్తూ బోదల సాహెబ్ కు పంపిస్తూ, ఎక్కడ వరకు వచ్చింది ఫోన్ చేసి చెపుతున్నాడు. మధ్యలో ఒకసారి కుటుంబ సభ్యులతో బెదిరించి మాట్లాడించి, సిటీ మొత్తం తిప్పి ముదిగొండ పోలీస్ వారి చూపించిన చాకచక్యానికి ౹ాదీ నగర్లో వదిలి వెళ్లిపోయినారు.

అప్పటినుండి ముద్దాయిల కోసం వెదుకుతుండగా, అందరూ కలిసి హైదరాబాద్ నుండి వైజాగ్ కు వారు ఉపయోగించిన వాహనాలలోనే పారిపోతుండగా, వారి కదలికలను పసిగట్టిన పోలీసులు తెలదారుపల్లి టోల్ ప్లాజా వద్ద ఈరోజు ఉదయం 8:00 గం,,లకు అరెస్ట్ చేసినారు. ముద్దాయిల వద్దనుండి ఒక అశోక్ లేలాండ్ ట్రక్, ఒక మారుతి స్విఫ్ట్ డిజైర్ కార్, రూ,, 1,05, 000/- ల నగదు మరియు (08) సెల్ ఫోన్లు స్వాధీన పర్చుకోనైనది.

# పేద ప్రజలందరికి సంక్షేమ పథకాలు అందాలనే లక్ష్యంతో పనిచేస్తున్న ప్రభుత్వం, రేవంత్ రెడ్డి ప్రభుత్వం.



పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలు అందాలనే లక్ష్యంతో పనిచేస్తున్న ఇందిరమ్మ రాజ్య ప్రభుత్వం, రేవంత్ రెడ్డి ప్రభుత్వమని, పేద ప్రజల కళ్ళల్లో ఆనందం చూడడమే ధ్యేయంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వమని ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య అన్నారు. గ్రామ సభల ప్రారంభం సందర్భంగా పట్టణ శివారు సీఎస్పీ బస్తి గ్రామపంచాయతీ సర్పంచ్ మోకాళ్ళ లావణ్య కృష్ణ ప్రసాద్ ఆధ్వర్యంలో ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేద మధ్యతరగతి ప్రజలందరికీ అండగా ఉంటుందని బడుగు బలహీన నిరుపేద ప్రజల కళ్ళలో ఆనందం చూడటమే ధ్యేయంగా, పేద ప్రజలందరికి సంక్షేమ పథకాలు అందాలనే లక్ష్యంతో రేవంత్ రెడ్డి నాయకత్వాన కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఇల్లందు శాసనసభ్యులు కనకయ్య పేర్కొన్నారు. కనీ విని ఎరగని రీతిలో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా ప్రభుత్వమని గుర్తించి రాష్ట్ర మహిళలందరికీ తమ గృహం నుండి రాష్ట్ర రాజధాని వరకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించిందని, అంతేకాకుండా 200 యూనిట్ ఉచిత విద్యుత్ అందించిన ప్రభుత్వం ఏదైనా ఉంది అంటే అది కాంగ్రెస్ ప్రభుత్వమే అని అన్నారు. అంతేకాకుండా పది ఏళ్ల పరిపాలించిన గత బిఆర్ఎస్ ప్రభుత్వం అందించలేని డబల్ బెడ్ రూమ్ సొంతింటి కలను, నూతన రేషన్ కార్డులను మంజూరు చేయడం నిరుపేదలందరికీ నేడు కాంగ్రెస్ ప్రభుత్వం అందించిందని నిరంతరం అందిస్తూనే ఉంటుందని ఆయన తెలిపారు. ఐదు లక్షలు గా ఉన్న ఉచిత వైద్యానికి నేడు కాంగ్రెస్ ప్రభుత్వం పది లక్షల పెంచిందన్నారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం అందించలేని సన్న బియ్యం పథకాన్ని రేషన్ కార్డులు ఉన్న వారికే కాకుండా సంక్షేమ హాస్టల్లో నివసించే పేద విద్యార్థులందరికీ సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఘనత రేవంత్ రెడ్డి నాయకత్వ న పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికే ఉందన్నారు. ఇది మహిళా ప్రభుత్వమని మహిళలకు అండగా ఉండే కాంగ్రెస్ ప్రభుత్వానికి మహిళలందరూ అండదండలుగా ఉండాలని ఆయన కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇంకా మూడు సంవత్సరాల పరిపాలనా కాల పరిమితి ఉందని రానున్న కాలంలో తమ గ్రామాల మండలాల పట్టణాల అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. ఏ సంక్షేమ పథకమైన అందని పేద ప్రజలు ఇల్లందు ఎమ్మెల్యే కార్యాలయానికి వచ్చి దరఖాస్తు అందజేయాలని దరఖాస్తులు పరిశీలించి సత్వర న్యాయం చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు ఎమ్మార్వో కోట రవికుమార్, ఇల్లందు ఎంపీడీవో కేథన్ సింగ్, చిరంజీవి,ఇల్లందు మండల పరిషత్ స్పెషల్ ఆఫీసర్, వెటర్నరీ పాల్గొన్నారు.

Edited, Printed, Published & Owned by NATAVA KRISHNA RAO, Published from: Krishna Publications, 10-74, Main Road, Chandoor, (Post &Mandal) Nalgonda 508 255, Telangana, Printed at: Krishna Publications, 10-74, Main Road, Chandoor, (Post &Mandal) Nalgonda 508 255,Telangana, Editor:NATAVA KRISHNA RAO, Cell: 9440991979,